"ఒక్క నిమిషం" అందామె.

తను ఓ క్షణం ఆశ్చర్యపోయాడు.

"ఆమెకి హెల్ప్ చేసినపుడు మొహంమీద కొట్టినట్టు మాట్లాడిన మనిషి- ఇప్పుడెంత సౌమ్యంగా మాట్లాడుతోంది? ఏమిటో ఈ ఆడవాళ్ళు అస్సలర్థం కారు. అందుకనే "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" అని నిందపడ్డారు అనిపించింది.

అయినా బయటపడకుండా "ఏమిటండీ?" అన్నాడు తను మర్యాదగా.

"ఆరోజు మీరు నా పర్స్, బస్‌పాస్ తెచ్చి యిచ్చినప్పుడు కాస్త పరుషంగా మాట్లాడాను. తీరా రూమ్‌కెళ్ళి ఆలోచిస్తే- నా విపరీతమైన ప్రవర్తన నాకే నచ్చలేదు. నాకోసం వెదుక్కుని, నేను పారేసుకున్న వాటిని తెచ్చియిచ్చిన వ్యక్తిని మనసు గాయపడేలా చేశానే అని చాలా ఫీలయ్యాను. ఒక్క క్షణంపాటు నేను మీరై ఆలోచించాను.

అప్పుడు తెలిసింది ..... మీ పరిస్థితిలో నేనున్నా అలాగే చేస్తానని. అప్పుడనిపించింది మీరు చేసిన దాంట్లో తప్పులేదని.

ఆ క్షణంనుంచీ మీకు సారీ చెబుదామని అనుకుంటూనే వున్నాను. కానీ ఎలా? మీ పేరు తెలియదు. అడ్రస్ తెలియదు.

నా తప్పుని నేను తెలుసుకుని సరిదిద్దుకునేదాకా నిద్రపోని మనస్తత్వం నాది.

ప్రతిరోజూ ఆఫీసుకి వెళుతూ, వస్తూ గమనించేదాన్ని మీరు ఎక్కడైనా కనిపిస్తారని. కానీ కనిపించలేదు. వారం రోజులై పోయింది.

లక్కీగా ఇవాళ మీరీ షాపులోకి వెళ్ళడం చూసి డ్రైవర్‌ని బ్రతిమాలి బస్సు ఆపించి దిగాను. ఆరోజు నా ప్రవర్తనకు నేను చాలా సిగ్గుపడుతున్నాను. అయామ్ వెరీసారీ" మనస్ఫూర్తిగానే అందామె.

"అయ్యయ్యో! ఎందుకలా అంటారు? ఫర్వాలేదండి" అన్నాడు తను. ఆ సమయంలో కలిగిన ఆనందం ఏమాత్రం బయటికి కన్పించనివ్వకుండా.

"ఇప్పుడు నా మనస్సు తేలికైంది. వస్తాను" అనేసి వడివడిగా ముందుకెళ్ళిపోయిందామె.

ఆమె రూపమే కాదు, వ్యక్తిత్వమూ, మాటతీరూ ఆకట్టుకున్నాయి తనకి. తృప్తిగా ఫీలయి బైక్ స్టార్ట్ చేసుకుని ముందుకు సాగిపోయాడు.

ఆ తరువాత మా పరిచయం పెరగడానికి జరిగిన సంఘటనల్ని మనస్వినితో చాలాసార్లు చెప్పించుకుని ఆనందించాను.

అవి గుర్తువచ్చి ఆనందరాగం ఆలపించాలనిపిస్తోంది ..... మరోసారి అవి గుర్తొస్తున్నాయి.

* * * * *

"డిపార్ట్‌మెంటల్ స్టోర్ దగ్గర కన్పించిన తర్వాత ఆఫీసుకి వెళుతూ, వస్తున్నపుడు నీ

గురించి చూసేదాన్ని. నేను సారీ చెప్పి, ఆదరంగా మాట్లాడినా నువ్వు మళ్ళీ నాకు తారసపడలేదు.

అదే ఇంకొకరైతే జెట్ స్పీడులో దూసుకెళ్ళి తెగ కటింగులిచ్చేస్తారు. కానీ నువ్వలా చేయలేదు.

సారీ చెబుదామంటే మీ పేరూ, అడ్రస్ తెలియని నేను డిపార్ట్‌మెంటల్ స్టోర్ దగ్గర అన్నప్పుడు మరొకరైతే తమ వివరాలూ, ఘనతలూ, వగైరా వగైరా చెప్పేసి డబ్బా వాయించేసుకుంటారు. కానీ నువ్వలా ఏమీ చేయలేదు. "నిజమైన జెంటిల్‌మెన్‌లా వుందతని ప్రవర్తన" అనిపింపజేశావ్. అప్పట్నుంచీ నాకు తెలియకుండానే నీ గురించి ఆలోచించేదాన్ని.

ఓ రోజు ఆర్.టి.సి వాళ్ళు స్ట్రైయిక్ చేయడంతో బస్సులు తిరగలేదు. ఉదయం ఆటోలోనే ఆఫీసుకి వెళ్ళాను. స్ట్రైయిక్ మధ్యాహ్నం అయిపోయి సాయంత్రానికి బస్సులు తిరుగుతాయట అనుకుంటున్నారు ఆఫీసులో. కానీ అలా ఏం జరగలేదు. బస్సులు సాయంత్రం కూడా తిరగలేదు. ఆటోయే శరణ్యం అనుకుని వాటిని వెదుక్కుంటూ నడుస్తున్నాను.

బేగంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జిమీద నడుస్తుండగా జరిగిందా సంఘటన. నా ముందునుంచే నడిచివెళుతున్న ఓ యాభై ఏళ్ళతను గుండెని పట్టుకుని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. నేను భయంగా చూశాను. 'హార్టెటాక్!' నాకేం చేయాలో తోచలేదు. హడావుడిగా జనాలు గుమిగూడి పోయారు.

నేనో వారగా నిలబడి ఇతన్నెవరయినా హాస్పిటల్‌కి తీసుకెళితే బాగుండును అనుకుంటున్నాను.

"అయ్యయ్యో హార్టెటాక్"

"చాలా ప్రమాదం."

"ఇదెన్నోసారో?"

"ప్రాణం వుందా పోయిందా?"

"ఏమో?"

రోడ్డంతా మోటార్‌సైకిళ్ళూ, స్కూటర్లతో నిండిపోయింది. అందరూ చోద్యం చూస్తూ నిల్చున్నారు. నాకు కోపం నషాళానికి అంటుకుంది.

"చావుబతుకుల మధ్యనున్న మనిషికి వెంటనే వైద్య సహాయం అందించాలనీ, సాటి మనిషిగా అది మన కనీసకర్తవ్యమని తెలీని వీళ్ళేం మనుష్యులు?" అనిపించింది. అక్కడున్న వాళ్ళంతా ఎవరికీ వారు ఎవరో వచ్చి సాయం చేస్తార్లే అనో, మనకెందుకులే అన్నట్టుగా వుండిపోయారు.

నాలో పట్టుదల పెరిగింది. ఆటో ఏదైనా వుంటే నేనే అతన్ని వైద్యుడి దగ్గరకు తీసుకెళ్ళాలని ఒక్క అడుగు ముందుకు వేశాను. అదే సమయంలో బైక్ ఆపి దిగుతున్నావు

నువ్వు. నిజాయితీగా నా పర్సు తెచ్చిచ్చి నిందలు పడిన నిన్ను అప్రయత్నంగానే మళ్ళీ అక్కడ చూశాను.

"ఏమైంది?" అడిగావు నువ్వు.

"పాపం గుండెపోటు" అన్నారెవరో.

"మరి వెంటనే హాస్పిటల్ తీసుకెళ్ళకుండా సినిమా చూస్తున్నారా?" అంటూ అతన్ని భుజాలకెత్తుకుని పరిగెడుతున్నట్టు వేగంగా కదిలిపోయావ్.

"ఏమిటి మనమీద విరుచుకుపడతాడు?"

"బహుశా వాళ్ళ బంధువు అయివుంటాడు."

"అంతే! లేకపోతే అతనికంత ఖర్మేంపట్టింది."

ఏదో జరుగుతుందని ఊహించిన వారందరికీ ఏమీ జరగపోవటంతో నిరుత్సాహంగా వెనుదిరిగారు. తుపాకీ పేలిన వెంటనే కొమ్మనొదిలి ఎగిరిపోయిన పక్షుల్లా ఎవరూ లేరక్కడ. నేనూ, నీ బైక్ తప్ప!

"పైగా హడావుడిలో నువ్వు బైక్‌కి లాక్ చేయ్యనూలేదు. కనీసం ఆ లాక్‌ని బైక్‌నుంచి తీసేయనూలేదు. లాక్‌చేసిన బళ్ళకే దిక్కులేని ఈ రోజుల్లో అరటిపండు వలిచి చేతికిచ్చినట్లు అలా లాక్‌తో సహా బండి కన్పిస్తే ఇంకేమైనా వుందా? నువ్విక్కడికి తిరిగి వచ్చేవరకైనా వుండటం నా కనీస ధర్మం!

మొదటిది ..... నువ్వు చేసిన హెల్ప్‌కి రుణం తీర్చుకునేట్టవుతుందీ, రెండవది గుండెపోటాయన పరిస్థితీ తెలుస్తుందని నీ బండి దగ్గరకి నడిచాను.

నలభై నిమిషాల తర్వాత వచ్చావు నువ్వు. నీ బండి దగ్గరున్న నన్ను చూసి ఆశ్చర్యపోయావు."

"నేనే! మీరు బండికి తాళం వేయకుండా హడావుడిగా వెళ్ళిపోయారు. కాపలాగా వున్నాను" చిన్నగా నవ్వుతూ అన్నాన్నేను.

"చాలా థాంక్సండీ. అప్పట్నుంచీ ఇక్కడే వున్నారా మీరూ?" అని అడిగావు.

"అవును!"

"సారీ! కంగారులో మిమ్మల్ని గమనించలేదు" నొచ్చుకున్నట్లు అన్నావు నువ్వు.

"ఆ క్షణంలో వుండవలసింది అదే! ఇంతకీ ఆ హార్టెటాక్ పేషెంట్ ఎలా వున్నాడు?"

"కోలుకున్నాడు."

"హమ్మయ్య!" నేను తేలిగ్గా నిట్టూర్చాను.

నువ్వు నా వంక అబ్బురంగా చూశావు.

"ఎవరికివారే చోద్యం చూస్తున్నారు కానీ ఎవరూ అతనిని వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళరే" చిరాకు ప్రదర్శిస్తూ అన్నాను నేను.

నువ్వు మౌనంగా తలూపి వూరుకున్నావు.

"చివరికి నేనే అతన్ని ఆటోలో హాస్పిటల్‌కి తీసుకెళదామని అనుకున్నాను. ఇంతలో దేవుడిలా వచ్చి అతని ప్రాణాల్ని కాపాడారు మీరు" అన్నాన్నేను.

దానికీ నువ్వు సమాధానం చెప్పలేదు.

చూస్తుండగానే చీకటైపోయింది.

"నన్ను మా హాస్టల్ వరకూ దింపండి ఆపద్బాంధవా!" నేనలా అడగ్గానే ఆశ్చర్యంగా చూశావు.

"అలా ఆశ్చర్యపోకండి. మీ పేరు తెలియక అలా సంబోధించాను. బస్సులు తిరగడంలేదు. ఆటోల కోసం నడిచి సగం, ఇక్కడ నిలబడి మొత్తం శక్తి ఎటో ఎగిరిపోయింది. మళ్ళీ ఆటోలకోసం వేట మొదలుపెట్టలేను ..... " అన్నాన్నేను.

దాంతో బైక్ స్టార్ట్ చేశావ్. స్లోగా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తూ మా హాస్టల్ దగ్గర్లో దింపావ్ "చాలా థాంక్స్. ఇప్పటికైనా మీ పేరు చెబుతారా?" అన్నాన్నేను.

"అయ్యో అదేమైనా భాగ్యమా చెప్పకపోవటానికి ..... మహదేవ్" అన్నావు నువ్వు.

నేను నీకు 'బై' చెప్పి హాస్టల్‌వైపు నడిచాను. నువ్వు వెనుదిరిగావ్. ఆ తరువాత జరిగిన సంఘటనలు తమని మరింత దగ్గర చేసిన వైనం గుర్తుకొచ్చి అతని కళ్ళు కాంతిపుంజాలయ్యాయి.

మళ్ళీ పదిహేను రోజుల వరకూ ఆమె కలువలేదు. ఓ రోజు హఠాత్తుగా రవీంద్రభారతిలో ఏదో ప్రోగ్రాముంటే అక్కడ కలిసింది. ప్రోగ్రామ్ చూడకుండా ఊసుల ఊయలలూగారిద్దరూ.

మళ్ళీ ఓ వారం గ్యాప్. ఈసారి ప్రపంచ తెలుసు మహాసభల్లో ఒకరికొకరి పునర్దర్శనం.

మునుపటికంటే ఫ్రీగా, ఆత్మీయంగా మనసులోని భావాలు పంచుకుంటూ తీయగా సరళంగా ఎదసొదల కబుర్ల కలనేతలు నేశారు.

తనతో మాట్లాడుతున్నంతసేపూ ఆమె కళ్ళల్లో తనమీద పెంచుకుంటున్న ప్రేమ మలయమారుతంలా తన అణువణువునీ స్పృశిస్తూ నూతనానుభూతులకి గురిచేస్తోంది. అది ఆకర్షణలోంచి పుట్టినప్రేమ కాదనీ తనకు తెలుసు. పరిణితి చెందిన బుద్ధితో అవతలి వ్యక్తి మనస్సూ వ్యక్తిత్వాన్ని పరిశీలించిన తరువాత పుట్టిన ప్రేమది.

ఆ తరువాత తరచూ కలుసుకోవటం, మనసు తలుపులు తీసి తలపులు ఏకం చేసుకోవటం, వెన్నెల వానల్లో నిండారా తడుస్తూ గుసగుసల సరిగమలతో హృదయాలను మీటుకోవడం, గుప్పెడు గుండెలో బుద్ధిగా ఒదిగిపోయిన ఒక్కొక్క జ్ఞాపకం ఒక ఖజూరహో శిల్పభంగిమై అతన్ని పరవశుడ్ని చేస్తోంది.

'టంగ్!' ప్రియురాలి ధ్యాసలోపడి తన ఉనికిని మరిచిపోయాడని ఉక్రోషమేమో వాల్‌క్లాక్ ఒంటిగంటయిందన్నట్లు కరుగ్గా మోగింది.

'ఉదయం ఫస్టు బస్సుకే అమ్మదగ్గరకెళ్ళి మనస్విని విషయం చెప్పాలి. ఇక పడుకుంటే

మంచిది' అని బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు అతను.

*　　*　　*　　*　　*

అభిరాం గదిలోని ఫోన్ రింగయింది.

మంచి నిద్రలో వున్నాడతను.

అప్పుడు సమయం సరిగ్గా ఆరున్నర అయింది.

అప్పటికే మెలకువ వచ్చేసిన వరప్రసాదం ఫోనెత్తాడు.

"హలో" అన్నాడు.

" ..... .....

"అవును."

" ..... ....."

"ఇంకా లేవలేదు! ఆ విషయం గురించి నాకు తెలియదు. నేను గెస్టుని" అన్నాడు.

" ..... ....."

"అలాగా! ఎప్పుడు జరిగిందట?" ప్రశ్నించాడతను.

" ..... ....."

"లేకపోతే లేపి చెప్పమంటారా?"

" ..... ....."

"అలాగే! తప్పకుండా. వుంటాను" అని ఫోన్ పెట్టేసి కాలకృత్యాలు తీర్చుకున్నాడు వరప్రసాదం.

సుమతమ్మ ఇచ్చిన కాఫీ తాగి అభిరాం గదిలోకి వెళ్ళాడు.

ఇంకా లేవలేదతను.

అతను లేచేదాకా ఎదురుచూస్తూ కూర్చున్నాడు. అయిదు నిమిషాలు తక్కువ ఏడవుతుండగా లేచాడతను. "శుభోదయం" అన్నాడు వరప్రసాదం.

"గుడ్ మార్నింగ్" చిన్నగా నవ్వి అన్నాడు అభిరాం.

అతను కూడా కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ తాగాక తను ఫోన్‌లో విన్న సంగతి చెప్పటానికి నిశ్చయించుకున్నాడు వరప్రసాదం. అభిరాం లేచి బాత్‌రూంలోకి నడిచాడు.

వరప్రసాదం ఆరోజు దినపత్రిక చదువుతూ వుండిపోయాడు హాల్లో.

ఓ పావుగంట తర్వాత అభిరాం ఫ్రెషప్ అయి హాల్లోకి వచ్చాడు.

అమ్మమ్మ అందించిన కాఫీ తాగుతూ సిటీ ఎడిషన్ చూస్తున్నాడు.

వరప్రసాదం మెయిన్ ఎడిషన్ కూడా అతనికే ఇచ్చేసి, కొంచెం సేపు కళ్ళు మూసుకు కూర్చున్నాడు.